



బాదేపల్లి మార్కెట్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన రైతులు

రైతుల ఆందోళన

మొక్కజొన్న కొనుగోలు చేయాలని

- బాదేపల్లి మార్కెట్ యార్డులో టెండర్లు వేయని ట్రేడర్లు
- సంచికి బదులుగా 1,300 గ్రాములు తూకం అధికంగా వేయాలని డిమాండ్
- మార్కెట్ కార్యాలయం ప్రధాన ద్వారం మూసి నిరసన

జడ్చర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు చేయాలని రైతులు ఆందోళనకు దిగిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివిధ ప్రాంతాల నుంచి 120 మంది రైతులు 4,500 క్వింటాళ్ల మొక్కజొన్నను మార్కెట్‌కు తెచ్చారు. మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా ట్రేడర్లు టెండర్ ప్రక్రియలో పాల్గొనలేదు. మొక్కజొన్నను తూకం వేసిన సందర్భంలో సంచికి బదులుగా 1300 గ్రాములు అధికంగా తూకం వేయాలంటూ కొర్రీలు పెట్టారు. ఈ అంశంపై 20 రోజుల క్రితమే మార్కెట్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చామని ట్రేడర్లు తెలిపారు. దాంతో రైతులు ఆందోళనకు దిగారు. మార్కెట్ కార్యాలయం వద్దకు చేరుకుని, మార్కెట్ కార్యదర్శిని నిలదీశారు. కార్యాలయం ప్రధాన ద్వారానికి ఉన్న గ్రిల్స్ బంద్ చేసి, నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. టెండర్‌లు వేయలేదన్న సమాచారం తెలుసుకున్న మార్కెట్ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, డైరెక్టర్లు సునీల్ సొంక్ల, శివ కిశోర్ మార్కెట్‌కు చేరుకున్నారు. మార్కెట్ కార్యదర్శి నవీన్‌తో కలిసి ట్రేడర్లతో ఫోన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్వాల్‌రెడ్డి చేరుకుని, పాలకవర్గం సభ్యులతో కలిసి ట్రేడర్స్‌తో మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని చెప్పారు. ఏమైనా ఉంటే సమావేశం నిర్వహించుకుని చర్చించుకుందామని అన్నారు. దాంతో ట్రేడర్స్ టెండర్లు వేశారు. దాంతో రైతులు ఆందోళన విరమించారు.



మహబూబ్‌నగర్ మండలం ఓబ్లాయిపల్లిలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇల్లు

పట్టాలెక్కుతున్న.. ఇందిరమ్మ ఇళ్లు

- మండలానికి ఒక గ్రామం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక
- మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో 2,097 మంది లబ్ధిదారుల గుర్తింపు
- మార్కింగ్, బేస్‌మెంట్‌ల పనులు షురూ
- ఏఈ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి కసరత్తు
- ఆర్థిక ఇబ్బంది ఉన్న లబ్ధిదారులకు మహిళా సంఘాల నుంచి రుణాలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడిప్పుడే పట్టాలు ఎక్కుతోంది. ఇప్పటివరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి, బేస్‌మెంట్‌ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా, లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యమే జరిగింది. జనవరి 26న పథకాన్ని ప్రారంభించినా అర్హులను ఎంపిక చేసి, ప్రొసిడింగ్స్ ఇవ్వడంలో సాగదీత ధోరణి కనిపిస్తోంది. ఇప్పుడిప్పుడే అధికారుల్లో కొంత కదలిక రావడంతో పథకం ఊపందుకుంటోంది. ప్రతీ నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. మొదటి విడతగా ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి లబ్ధిదారులను గుర్తించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 16 మండలాల్లో 16 గ్రామాలకు చెందిన 1,238 మందిని, నారాయణపేట జిల్లాలోని 11 మండలాల్లో 11 గ్రామాలకు చెందిన 859 మంది లబ్ధిదారులను గుర్తించారు. అందులో 30 శాతం లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు అధికార యంత్రాంగం మార్కింగ్ ఇవ్వగా, అందులో కొందరు బేస్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. వారం రోజుల్లో మిగతా 70 శాతం నిర్మాణాలు ప్రారంభించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దాంతో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు.

వారం తరువాత మిగతా లబ్ధిదారుల ఎంపిక

వారం రోజుల తరువాత పైలెట్ గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించనున్నారు. లబ్ధిదారుల ఎల్ 1 జాబితాను తయారు చేసేందుకు కలెక్టర్‌ల ఆదేశానుసారం పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మండల కంట్రోలింగ్ అధికారులు సర్వే చేసి, పైలెట్ ప్రాజెక్టు లబ్ధిదారులతో కలిపి ప్రతీ నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వారి దరఖాస్తులు, ఇంటి నిర్మాణ స్థలాలను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. అయితే లబ్ధిదారులలో ఆర్థికంగా వెనుకబడిన వారికి మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష రుణాలు ఇవ్వాలన్న కసరత్తు జరుగుతోంది. మహిళా సంఘాలలో సభ్యులుగా ఉన్న ఇందిరమ్మ లబ్ధిదారుల్లో నిరుపేదలు ఉంటే వారికి రుణాలిచ్చి, బేస్‌మెంట్ నిర్మాణం చేసిన తరువాత ప్రభుత్వం విడుదల చేసే లక్ష రూపాయలను మళ్లీ మహిళా సంఘాల ఖాతాలో జమ చేయనున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆధ్వర్యంలో నిరుపేద లబ్ధిదారులను గుర్తించి వారికి రుణాలను ఇవ్వనున్నారు.

బ్రిక్స్ తయారీ, మేస్త్రీలకు శిక్షణ

ఇందిరమ్మ ఇళ్ల కోసం అవసరమైన సి మెంట్ బ్రిక్స్ అందించేందుకు గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో ఇటుకల తయారీ మిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటికే 12 మంది మిషన్‌లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. వారికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ వెరిఫికేషన్ కూడా పూర్తయ్యింది. అదేవిధంగా ఇళ్ల నిర్మాణాలలో మేస్త్రీల కొరత తీర్చేందుకు మొదటి విడతలో 14 మందికి, రెండో విడతలో 40 మందికి మొత్తం 54 మందికి శిక్షణ ఇచ్చారు. సెంట్రింగ్ కొరత లేకుండా ఉండేందుకు మహిళా సంఘాలలో సభ్యులుగా ఉన్న వారి భర్తలు సెంట్రింగ్ ఏర్పాటు చేసుకునేందుకు సంఘాల ద్వారా రుణాలు ఇవ్వనున్నారు. దీంతోపాటు గృహ నిర్మాణ శాఖలో సిబ్బంది కొరతను తీర్చేందుకు కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులను తీసుకుని వారికి శిక్షణ ఇవ్వడం, ఏఈల భర్తీతో పాటు అవుట్‌సోర్సింగ్ పద్ధతిన వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లను తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు.



మహమ్మదాబాద్ మండలం చిన్నోయిపల్లిలో బిల్లు కోసం లబ్ధిదారు బేస్‌మెంట్ నిర్మాణాన్ని యాప్‌లో జియోట్యాగింగ్ చేయడానికి పరిశీలిస్తున్న అధికారి

పథకాన్ని వేగవంతం చేస్తున్నాం

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతం చేశాం. పైలెట్ గ్రామాలలో ఇప్పటికే మార్కింగ్‌లు ఇవ్వడంతోపాటు బేస్‌మెంట్‌ల నిర్మాణం జరుగుతోంది. బేస్‌మెంట్‌లు పూర్తిచేసిన లబ్ధిదారులకు బిల్లులు ఇచ్చేందుకు అధికారులు మొబైల్ యాప్‌లో జియోట్యాగింగ్ చేస్తున్నారు. దీని ఆధారంగా ఈ వారం రోజుల్లోనే బేస్‌మెంట్ బిల్లులు రానున్నాయి. మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్ట్ కింద మండలానికి ఓ గ్రామంలో లబ్ధిదారులను ఎంపిక చేసి, పనులు ప్రారంభించాం. వారంలో మిగిలిన 70 శాతం బేస్‌మెంట్ నిర్మాణాల పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. మిగతా గ్రామాలలో లబ్ధిదారుల ఎంపికను తొందరలో పూర్తి చేయనున్నాం.

- వైద్యం భాస్కర్, హౌసింగ్ పీడీ

భానుడి భగభగ.. వరణుడి వడగళ్లు

మహబూబ్‌నగర్/నారాయణపేట/రాజాపూర్/వనపర్తి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాలమూరులో అకాలవానలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం వరకు 40 డిగ్రీల ఉష్ణోగ్రతతో జనం ఉక్కిరిబిక్కిరికాగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఉన్నట్టుండి వాతావరణం చల్లబడింది. జిల్లా కేంద్రంలో అరగంట పాటు మోస్తరు వాన కురిసింది. రైతు మార్కెట్‌లో వడగళ్ల వాన కురిసింది. వర్షంతో పాటు కొద్దిసేపు వడగళ్లు కురవడంతో జనం వాటిని ఆసక్తిగా గమనించారు. పాలమూరులో 4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాజాపూర్ మండల కేంద్రంలో కూడా వడగళ్ల వాన కురిసింది. దాదాపు 20 నిమిషాల పాటు ఓ మోస్తరు వాన కురిసింది. అయితే మండలాలు, గ్రామాల్లో ఎక్కడా వాన కురవకపోవడంతో అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. వరి కోతలు సాగుతున్న సమయంలో వర్షం పడితే తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో గరిష్ఠంగా 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, అత్యల్పంగా ఖిల్లాఘణపురం మండలంలో 37.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీలు, జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజలో గరిష్ఠం 40.1, కనిష్ఠం 26.4 డిగ్రీలు నమోదైంది.

రూ.2 కోట్లతో.. అభివృద్ధి

- రెండు నెలల్లో అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి మినీ ట్యాంక్‌బండ్
- ప్రజలు కుటుంబ సభ్యులతో వచ్చి సరదాగా గడిపేలా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- రూ.50 లక్షల ముడా నిధులతో సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన



మినీట్యాంక్ బండ్‌పై విద్యుత్ దీపాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మినీ ట్యాంక్‌బండ్‌ను అన్ని విధాల అభివృద్ధి చేసి సందర్శకులకు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రూ.2 కోట్ల ముడా నిధులతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. సోమవారం రూ.50 లక్షల ముడా నిధులతో ట్యాంక్‌బండ్‌పై చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ లైటింగ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తొందరలోనే మరో రూ.కోటిన్నరతో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నామని అన్నారు. ఆ నిధులతో సైక్లింగ్, నడకదారి, గ్రీనరీ ఏర్పాటు చేస్తామన్నారు. మరో రెండు నెలల్లోనే సమగ్రంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. నగర ప్రజలకే కాకుండా చుట్టు పక్కల ప్రాంత ప్రజలు సందర్శించేందుకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామన్నారు. గత ప్రభుత్వం నిధుల లేమితో మధ్యలోనే పనులను నిలిపివేసిందన్నారు. ట్యాంక్ బండ్ అభివృద్ధి పనుల నిధుల కోసం ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో చర్చించడం జరిగిందని, వాళ్లు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఏ పని మొదలుపెట్టినా మధ్యలో నిలిపివేయదన్నారు. ప్రజలంతా కుటుంబ సభ్యులతో వచ్చి సరదాగా గడిపేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు సిరాజ్‌ఖాద్రి, సీజే బెనహర్, అజ్మత్‌అలీ, శాంతయ్య, ఖాజాపాష, మునీర్, మోసిన్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

511 మందికి రేషన్ కార్డుల పంపిణీ

మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన గ్రామాల ప్రజలకు మంజూరైన 511 రేషన్‌కార్డులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా పంపిణీ చేయలేదని విమర్శించారు. 75 ఏళ్ల చరిత్రలో ఎన్నడూలేని విధంగా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్‌అలీ, శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, మోహన్‌రెడ్డి, మల్లు అనిల్‌కుమార్‌రెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మహిళలే ముందంజ

- ఉపాధి పని దినాలను ఎక్కువగా వినియోగించుకున్నది వారే
- నారాయణపేట జిల్లాలో 1,10,809 జాబ్ కార్డులు

నారాయణపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నారాయణపేట జిల్లాలో మహిళలే అగ్ర స్థానంలో నిలిచారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పురుషుల కంటే వారే అధిక పని దినాలను వినియోగించుకున్నారు. నారాయణపేట జిల్లాలో 1,10,809 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 71,309 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. జాబ్ కార్డుల్లో పేర్లు నమోదైన పురుషులు 97,641 మందికి గాను 54,053 మంది పనులు చేయగా, మహిళలు 1,03,561 మందికి గాను 67,057 మంది పనులు చేశారు. పురుషుల కంటే మహిళలు 13,004 మంది అధికంగా పనుల్లో పాల్గొన్నారు. పలుగు, పార చేతపట్టి పురుషులతో సమానంగా పనులు చేస్తున్నారు. వ్యవసాయ పనుల తో పాటు ఉపాధి పనులు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.



మక్తల్ మండలం లింగంపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నిరుపేదలు సన్న బియ్యం తినాలన్నదే లక్ష్యం

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి లంకాలలో బియ్యం పంపిణీ



నర్వ మండలం లంకాల గ్రామంలో లబ్ధిదారు రేణుక ఇంట్లో సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి): ప్రతీ నిరుపేద సన్న బియ్యం అన్నం తినాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం నర్వ మండలంలోని లంకాల గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి కలెక్టర్ సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారు రేణుక ఇంట్లో సన్న బియ్యంతో వండిన అన్నం తిన్నారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సన్న బియ్యం పథకం గొప్పదని, సీఎం రేవంత్ రెడ్డి పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అయ్యిందని, ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు మాత్రమే కాకుండా ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తున్నదని చెప్పారు. పేదవాడు కలలు కన్న తెలంగాణ ఇదేనని అన్నారు. అంతకు ముందు గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ప్రత్యేక అధికారి పాల్గొన్నారు.

పది మూల్యాంకనం ప్రారంభం

- విధులు వద్దంటూ పలువురు ఉపాధ్యాయుల వినతులు
- మధ్యాహ్నం తర్వాత ప్రారంభం
- స్పాట్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తేవడంతో వారించిన డీఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గ్రామర్ పాఠశాలలో సోమవారం ప్రారంభమైంది. కొందరు ఉపాధ్యాయులు స్పాట్ విధుల నుంచి తమను రిలీవ్ చేయాలని క్యాంపు అధికారి, డీఈవో ప్రవీణ్‌కుమార్‌కు వినతులు ఇచ్చారు. వారికి మద్దతుగా ఉన్న సంఘాల నాయకులతో సిఫారసు చేయించుకొని మెడికల్, ఇతర కారణాలు చూపి ఉత్తర్వులు రద్దు చేయించుకునేందుకు ప్రయత్నించారు. అవసరం ఉన్న వారికి మాత్రమే విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు.

2.26 లక్షల జవాబు పత్రాల మూల్యాంకనం

రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సంబంధించి 2.26 లక్షల జవాబు పత్రాలు మూల్యాంకనం కోసం జిల్లాకు చేరుకున్నాయి. మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలకు చెందిన జీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విధులు నిర్వహిస్తున్నారు. క్యాంపు అధికారులుగా నలుగురు, అసిస్టెంట్ క్యాంపు అధికారులుగా 7 గురు, సూపరింటెండెంట్లుగా 15 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా 1,094 మంది, స్పెషల్ అసిస్టెంట్స్‌గా 361 మంది, క్లాస్ ఫోర్త్ స్టాఫ్ 26 మంది విధుల్లో పాల్గొననున్నారు. అయితే 62 మంది ఉపాధ్యాయులు అనారోగ్యం, ఇతర సమస్యలతో స్పాట్ విధులను రద్దు చేయించుకున్నారు. మొదటి రోజు ఉపాధ్యాయులు విధుల్లో చేరేందుకు రిపోర్టు చేయగా, మధ్యాహ్నం నుంచి మూల్యాంకనం ప్రారంభమైంది.

స్పాట్ రూమ్‌లోకి సెల్‌ఫోన్స్

జవాబు పత్రాల మూల్యాంనం చేసే గదుల్లోకి సెల్‌ఫోన్స్ ఎలక్ట్రానిక్ పరికారాలు తీసుకరావొద్దనే నిబంధన ఉన్నా. కొందరు ఉపాధ్యాయులు తీసుకొచ్చారు. డీఈవో ప్రవీణ్‌కుమార్ పలుమార్లు చెప్పినా ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో వారినుంచి ఫోన్లు తీసుకుని, బయట ఉన్న కౌంటర్‌లో డిపాజిట్ చేయించారు. మంగళవారం నుంచి ఉపాధ్యాయులు స్పాట్ గదుల్లోకి వెళ్లే ముందు సెల్‌ఫోన్స్ డిపాజిట్ చేసి, వెళ్లాలని చెప్పారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పలువురు ఉపాధ్యాయుల స్పాట్ విధులను రద్దు చేయాలని డీఈవోను కోరుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు
7

హత్య కేసులో నేరస్థునికి యావజ్జీవం
7

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య
7


వాలీబాల్ శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు (ఫైల్)


అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్ సునీల్ (ఫైల్)

వేసవి క్రీడా శిబిరాలు

- కోచ్‌ల ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరణ
- జాతీయ స్థాయి క్రీడాకారులకు అవకాశం
- వచ్చే నెల 1 నుంచి వేసవి శిబిరాలు ప్రారంభం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారులకు వేసవి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా యువజన, క్రీడాశాఖ జాతీయ స్థాయి, సీనియర్ క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవిలో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. సీనియర్ క్రీడాకారులైతే వారి స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో ఈ నెల 25లోగా జిల్లా క్రీడాశాఖ కార్యాలయం దరఖాస్తు చేసుకోవాలి. వారి అర్హత బట్టి కోచ్‌లను ఎంపిక చేస్తారు.

వచ్చే నెల 1 నుంచి శిబిరాలు

వచ్చే నెల 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తారు. దాదాపు 25కుపైగా శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోచ్‌లు శిక్షణ ఇస్తారు. ఒలింపిక్‌లో గుర్తింపు ఉన్న క్రీడల్లో మాత్రమే శిక్షణ ఉంటుంది. అర్బన్‌లో పది శిక్షణ శిబిరాలు ఉంటాయి. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, బాక్సింగ్, చెస్, ఫెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో కోచ్‌లు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.


మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన స్టేడియం

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..



వేసవి శిక్షణ శిబిరాల కోసం జిల్లాలోని జాతీయ స్థాయి, సీనియర్, వ్యాయమ ఉపాధ్యాయులు దర ఖాస్తులు చేసుకోవాలి. మే 1 నుంచి 31 వర కు శిక్షణ ఉంటుంది. ఈ నెల 22 వరకు స్టేడి యం మైదానంలో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎంపికైన కోచ్‌లు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ క్రీడా అంశాల్లో శిక్షణ ఇస్తారు.

- ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

బాధితురాలికి అండగా నిలవాలి

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్
- ఊర్కొండ పేట గ్రామంలో పర్యటన


ఊర్కొండలో విలేకరులతో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తదితరులు

ఊర్కొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఊర్కొండపేట అత్యాచార ఘటనను మహిళ కమిషన్ సుమోటోగా స్వీకరించి బాధితురాలికి అండగా నిలవాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్యాచార సంఘటనపై నిజ నిర్ధారణ కోసం పౌర హక్కుల సంఘం రాష్ట్ర, ఉమ్మడి జిల్లా కమిటీలు నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామంలో పర్యటించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించా రు. గ్రామస్థులు, ఆలయ అధికారులు, భక్తులు, పూజారులతో మాట్లాడి వివరాలు తెలుసుకు న్నారు. స్థానిక ఎస్‌ఐ కృష్ణదేవను కలిసి నింది తుల వివరాలు, గతంలో వారి నేర చరిత్ర తదితర అంశాలను ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆలయం వద్ద రక్షణ చర్యలు లేకపోవడం, పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ సంఘటన జరిగిందన్నారు. భక్తుల రాకపోకలను పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బాధితురాలికి ఎనలేని నష్టం వాటిల్లిందని, ఆమెను, ఆమె కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. అత్యాచార ఘటనపై లోతుగా విచారించాలని, ప్రజాప్రతినిధులు, నాయకుల ఒత్తిడికి లోను కాకుండా సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. బాధితురాలికి ప్రజాప్రతినిధులు, మహిళా కమిషన్ అండగా ఉండాలని కోరారు. పౌర హక్కుల సంఘం మహిళా సభ్యులు బాధితురాలిని కలువలేకపోవడంతో పూర్తి వాస్తవాలు బయటికి రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల కమిషన్ కూడా వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కబాలయ్య, నాయకులు పంబలి బాలయ్య, లక్ష్మీనారాయణ, కలకొండ రాములు, వెంకటేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీ రద్దు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నగరంలో ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి బాలుర క్రికెట్ టోర్నీని రద్దు చేస్తూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈవో సురేషక దోషి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి రిటైర్డ్ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న జూనియర్ కళాశాలల్లో ఉన్న ఒక పీడీ రిటైర్డ్ కావటంతో ఖాళీ ఏర్పడింది. పీడీలు లేక పోవటంతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నియామకం చేపట్టలేదు.

కబడ్డీ విజేత గుజరాత్

- హోరాహోరీగా మహిళా కబడ్డీ పోటీలు
- అయిజ మండలం మూగోనిపల్లిలో పోటీల నిర్వహణ


జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో మొదటి బహుమతి సాధించిన గుజరాతీ జట్టు

అయిజ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం మూగోనిపల్లిలో నిర్వహించిన జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. నువ్వా, నేనా అనే రీతిలో గెలుపు కోసం తలపడ్డారు. గుజరాత్, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొన్నారు. మొత్తంగా 12జట్లు ఈ క్రీడా పోటీల్లో తలపడ్డారు. శ్రీరామ నవమి సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీల్లో విజేతగా నిలిచిన గుజరాత్ జట్టు రూ.40వేల నగదును గెలుపొందింది. రెండో బహుమతి రూ.30వేలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా దక్కించుకుంది. మూడో బహుమతి రూ.20వేలను తమిళనాడు, రూ.10వేలను తిరుపతి జట్లు దక్కించుకున్నాయి. విజేతలకు గ్రామపెద్దల చేతుల మీదుగా నగదు అందజేశారు.

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలం తీగలపల్లికి చెందిన ఓ వివాహిత అదృశ్యం అయ్యిందని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజు, కురువమ్మ(25) భార్యా భర్తలు. జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో నివసిస్తున్నారు. రాజు కూలీ పని చేస్తుండగా, కురు వమ్మ కొల్లాపూర్ చౌ రస్తాలోని ఓ హోటల్లో పని చేస్తోంది. ఈనెల 1న బయటకు వెళ్తానని చెప్పి వెళ్లిన కురువమ్మ ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతరవేళ విషాదం

- కాలువలో కొట్టుకుపోయిన చిన్నారులు
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు


కాలువలో కొట్టుకుపోయిన అంజలి(ఫైల్)

రాయచూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సంబరంగా గడపాలని జాతరకు వచ్చిన ఆ రెండు కుటుంబాల్లో విషాదం మిగిలింది. రాయచూరు జిల్లా ఇడపనూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాయచూరు తాలూకాలోని గాణదాళ పంచముఖి ఆంజనేయ స్వామి జాతరకు ఆ రెంటు కుటుంబాలు పిల్లలతో సహా వచ్చారు. కుటుంబ సభ్యులందరూ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఆ బాలిక, బాలుడిద్దరూ సమీపంలోని కాలువ వద్దకు వెళ్లి స్నానం చేసే ప్రయత్నం చేశారు. అయితే నీటి ఉధృతి కారణంగా వాళ్లు కొట్టుకుపోయారు. బాలికను తెలంగాణ రాష్ట్రం గద్వాల ప్రాంతానికి చెందిన అంజలి(17)గా, బాలుడిని ఏపీ రాష్ట్రం ఎమ్మిగనూరుకు చెందిన రఘు(14)గా గుర్తించారు. తల్లిదండ్రులు చూస్తుండగానే వీరిద్దరూ నీళ్లల్లో మునిగి కొట్టుకుపోయారు. పిల్లలను కాపాడలేక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న కారణంగా ఎవ్వరూ కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గల్లంతైన వారి కోసం గాలింపు చేపట్టారు. సంఘటన సంబంధించి ఇడపనూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతకు ఉపాధి

- వనపర్తిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు
- ఎకరా స్థలం, రూ.4.77 కోట్లు కేటాయింపు
- ప్రస్తుతం 172 మంది విద్యార్థులకు నలుగురు అధ్యాపకులతో బోధన
- ప్రాక్టికల్స్ నిర్వహణకు భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న విద్యార్థులు


నిర్మాణంలో ఉన్న ప్రాక్టికల్స్ నిర్వహించే భవనం

వనపర్తి విద్యా విభాగం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పేద విద్యార్థులకు టెక్నికల్ రంగంలో నైపుణ్యాల పెంపే లక్ష్యంగా గతంలో పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను ఏర్పాటు చేశారు. నేడు వేగంగా మారుతున్న టెక్నికల్, సాంకేతిక రంగాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే గతేడాది ఆగస్టులో ఏటీసీని ఏర్పాటు చేసేందుకు వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజపేట శివారులో ఐటీఐ కళాశాల సమీపంలో ఎకరా స్థలాన్ని కేటాయించి, రూ.4.77 కోట్ల నిధులను మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో ఆరు కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఐటీఐ కళాశాల భవనంలోనే ఏటీసీ తరగతులను నిర్వహిస్తున్నారు. మొదటి ఏడాది 172 సీట్లను భర్తీ చేసి వారికి నలుగురు అధ్యాపకు లు బోధిస్తున్నారు. ఏటీసీకి కేటాయించిన ఎకరా స్థలంలో ప్రయోగశాల నిర్మాణ పను లు 50 శాతం వరకు పూర్తయ్యాయి. భవనం త్వరితగతిన పూర్తి చేసి ప్రాక్టికల్స్ నిర్వహించుకునేందు కుపరికరాలను ఏర్పాటు చేస్తే విద్యా ర్థులకు మరింత ప్రయోజనం ఉంటుందని అధ్యాపకులు చెబుతున్నారు.

కోర్సులు	సీట్లు	కాలపరిమితి
ఇండస్ట్రియల్ రొబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్	40	సంవత్సరం
మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	40	సంవత్సరం
ఆర్టీసీఎన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్	20	సంవత్సరం
బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్	24	2 సంవత్సరాలు
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్	24	2 సంవత్సరాలు
మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికిల్	24	2 సంవత్సరాలు

ప్రాక్టికల్ బిల్డింగ్‌ను త్వరగా పూర్తి చేయాలి



నేను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో ఏడు నెలలుగా ఇండస్ట్రియల్ రొబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ కోర్సును చేస్తున్నాను. మిగ్ విల్లింగ్ గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. ఇక్కడ ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న ప్రాక్టికల్‌గా నేర్చుకునేందుకు బిల్డింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రాక్టికల్ కోసం నిర్మితమవుతున్న బిల్డింగ్ త్వరగా పూర్తి చేయించాలి.

- అక్షయ్, కొత్తకోట

నూతన నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం..



యువత ఇండస్ట్రీయల్‌లో పని చేయడానికి కంప్యూటర్ సాఫ్ట్, న్యూమరికల్ లాంటి అనేక నైపుణ్యాలను యువతకు నేర్పిస్తున్నాం. రాబోయే రోజుల్లో పెరిగే టెక్నాలజీని దృష్టిలో ఉంచుకుని దానికి అనుగుణంగా యువతను తీర్చిదిద్దుతున్నాం. కంపెనీలు ఏటీసీ సెంటర్లకు వచ్చి తమకు కావాల్సిన యువతను రిక్రూట్‌మెంట్ చేసుకుంటాయి.

- భాస్కర్, టీటీఎల్ ఇన్‌స్పెక్టర్

ఉన్నతమైన ఉద్యోగం సాధించాలనేది లక్ష్యం



మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికల్ కోర్సు చేస్తున్నాను. ఎలక్ట్రానిక్ వెహికల్స్‌ను ఉపయోగించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా రక్షించుకోవచ్చు అని తెలుసుకున్నాను. ఎలక్ట్రానిక్ వెహికిల్ రంగంలో మంచి ఉద్యోగంలో స్థిరపడాలనే లక్ష్యంతో నేర్చుకుంటున్నాను. ప్రాక్టికల్ చేసేందుకు బిల్డింగ్ పూర్తికాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- అక్షయశ్రీ, కడుకుంట్ల

కన్వేయర్ బెల్ట్ పొడిగింపునకు చర్యలు

- 4 రోజుల పాటు సహాయక చర్యలకు ఆటంకం
- ఈ నెల 18 వరకు శిథిలాల తొలగింపు


టన్నెల్‌లో ఉబికి వస్తున్న నీరు

దోమలపెంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో (టన్నెల్) ప్రమాద ఘటన జరిగి సోమవారానికి 45 రోజులు గడిచింది. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి రెస్క్యూ బృందాల అధికారులతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడవు వరకు శిథిలాల తొలగింపు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెస్క్యూ బృందం అధికారులను ఆదేశించారు. సహాయక చర్యల్లో ఆర్మీ అధికారులు, సింగరేణి మైన్స్ రెస్క్యూ మేనేజర్ బైద్య, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా, రైల్వే అధికారి రవీంద్రనాథ్, జీఎస్‌ఐ, ఇరిగేషన్, జెపీ కంపెనీ ప్రాజెక్టు సీనియర్ ఇంజనీర్ సంజయ్ కుమార్ సింగ్ వివిధ శాఖల అధికారులు పాల్గొంటున్నారు.

8 నుంచి 11వ తేదీ వరకు...

ప్రస్తుతం శిథిలాల తొలగింపు పనులు జరుగుతున్న 13.730 కిలోమీటర్ల నుంచి 13.800 కిలో మిటర్ వరకు కన్వేయర్ బెల్ట్‌ను పొడిగించనున్నట్లు రెస్క్యూ బృందం అధికారులు చెప్తున్నారు. ఈ పనులు 8 నుంచి 11వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా నాలుగు రోజుల పాటు బురద, మట్టిని బయటకు తరలించడం సాధ్యం కాదని తెలిపారు. బండరాళ్లు, కత్తిరించిన ఇనుప శకలాలను బయటకు తరలిస్తూ కన్వేయర్ బెల్ట్ పొడిగింపు పనులను కొనసాగించనున్నారు. కన్వేయర్‌ను బెల్ట్ పొడిగింపు ఇదే చివరి సారని, మిగిలిన 70 మీటర్ల వరకు ఉన్న శిథిలాలను పూర్తిగా తొలగిస్తామని రెస్క్యూ బృందాల సభ్యులు చెప్తున్నారు. 13.936 కిలోమీటర్ల అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా పరిగణించి, 43 మీటర్ల వరకు కంచె నిర్మించారు. అక్కడ తవ్వకాలు జరిపే పరిస్థితులు లేవని అధికారులు చెప్తున్నారు.

ఖాళీ స్థలాలపై విచారణకు ఆదేశాలు

- కమిషనర్‌ను ఆదేశించిన అదనపు కలెక్టర్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గద్వాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో కబ్జాకు గురైన ఖాళీస్థలంపై పూర్తిస్థాయిలో విచా రించాలని, ఆ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూడాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు సోమవారం మునిసిపల్ కమిషనర్ దశరథ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ నెల 6న ఆదివారం ఖాళీగా ఉంటే కబ్జా.. శీర్షికన కథనంవెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి ముగిసిన వెంటనే మునిసిపల్ కమిషనర్‌కు ఈ స్థలంపై పూర్తి వివరాలను సేకరించాలని, అక్కడి గుడిసెకు సంబంధించి ఇంటి నెంబర్ పరిశీలించాలని, ఆ నెంబర్‌ను మునిసిపల్ కార్యాలయంలో ఏ అధికారి ఇచ్చారనే విషయాలను పరిశీలించాలని ఆదేశించారు. పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. ఆ స్థలం మునిసిపాలిటీదా, హౌసింగ్ బోర్డు పరిధిలోనిదా అని తేల్చాలని, త్వరగా నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లను భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం 1962 నుంచి ఎన్ని చట్టాలు, జీవోలు వచ్చినా అమలు కాలేదన్నారు. బీహార్‌లో బీసీ రిజర్వేషన్లను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచితే, ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. దేశంలో మేధావులంతా అగ్ర కులానికి చెందిన వారే ఉండడంతో కింద వర్గాలను పీడిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి, నిబద్ధతను నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పిడికిళ్ల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, అరవిందాచారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వంగూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని జాజాల గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాజాల మాజీ సర్పంచ్ బాలస్వామిగౌడ్ ద్విచక్ర వాహనంపై అన్నారం గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నది. ప్రమాదంలో బాలస్వామిగౌడ్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థాని కులు అతడిని 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వెల్దండలోని యెన్నం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మహేందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

క్రైం కార్నర్

లారీ పై నుంచి జారిపడి డ్రైవర్ మృతి

మానవపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లారీపై నుంచి జారిపడిన లారీడ్రైవర్ మృతిచెందాడని ఎస్‌ఐ చంద్రకాంత్ సోమవారం తెలిపారు. ఆ వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్టానికి చెందిన ఎండీ ఇమ్రాన్ (24) ఉత్తరప్రదేశ్ నుంచి బెంగళూరుకు లారీలో గోధుమల లోడ్‌తో వెళ్తున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని 44వ జాతీయ రహదారి జల్లాపురం శివారులోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద లారీకి సంబంధించిన పత్రాలు చూపి, తిరిగి వచ్చి లారీ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. కర్నూల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బాబాయ్ ఇక్బాల్‌అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

వీపనగండ్ల, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన బొలెరో డ్రైవర్ రాఘవేందర్(39) చికిత్స పొందుతూ... సోమవారం మృతిచెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గోవర్ధనగిరికి చెందిన రాఘవేందర్ శనివారం మామిడి కాయల లోడుతో హైదరాబాద్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆదివారం హైదరాబాద్ రింగ్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కోస్గి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కూతురు మాట వినడం లేదని మనస్తాపానికి గురైన తండ్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం స్థానిక ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పేట జిల్లా కోస్గి మండలం బిజ్జారం గ్రామానికి చెందిన కుర్వ మల్లప్ప(45) కొన్ని రోజుల నుంచి తన కూతురు మాట వినటం లేదని మనస్తాపానికి గురై గతనెల 31న తన వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బాధితుడి తల్లి మరికొందరి సాయంతో మల్లప్పను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లప్ప ఆదివారం రాత్రి మృతి చెందాడు. తల్లి కుర్వ బసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాయనమ్మ సంరక్షణ విషయంలో గొడవ

▸▸ అన్న కుమారుడిపై బాబాయిల దాడి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పారెడ్డిపల్లికి చెందిన బురగల్ల శివపై తన బాబాయిలు కృష్ణయ్య, రాములు, శివుడు కలిసి కర్రతో దాడి చేసి గాయపరిచారని సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బురగల్ల శివ తండ్రి ఇంతకు ముందే మృతిచెందాడు. దీంతో నానమ్మ అంజలమ్మ తన బాబాయిలు వంతుల వారీగా సంరక్షిస్తున్నారు. ఈ విషయంలో ఈ నెల ఆరో తేదీన శివపై బాబాయిలు దాడి చేశారు. పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామనే తరుణంలో అదే రోజు రాత్రి ముగ్గురు బాబాయిల భార్యలు శ్యామలమ్మ, అలివేలు, విజయలక్ష్మి ఫిర్యాదుదారుడి ఇంటిపైకి వెళ్లి కట్టెతో కొట్టి గాయపరిచారు. దీంతో శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ గౌడ్ తెలిపారు.

42 ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్



మామిడిమాడలో ఇసుక డంపును సీజ్ చేస్తున్న తహసీల్దార్ సుగుణ

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిమాడలో అక్రమంగా నిల్వ చేసిన 42 ట్రాక్టర్ల ఇసుక డంపును సోమవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. గ్రామంలో క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక డంపు చేసినట్లు గుర్తించామన్నారు. మామిడిమాడలో ఫిల్టర్ ఇసుక తయారు చేయడానికి నేరేడు చెరువులో తవ్విన గోతులను పరిశీలించారు. అక్రమంగా ఇసుకను నిల్వ చేయడం, సరఫరా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ తిరుపతయ్య, సర్వేయర్ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి నవీన్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

హన్వాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఇదాయత్‌అలీ తెలిపారు. సోమవారం కోయిల్‌కొండ మండలం సురారం నుంచి వెంకటపూర్ చెందిన టిప్పర్ ఇసుకను తరలిస్తుండగా పెద్దదర్పల్లి సమీపంలో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని కావేరమ్మపేట సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న రాజీవ్‌నగర్‌కాలనీలో సోని (40) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన సోనీ, తన సోదరుడితో గొడవ పడి మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి 10గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సోని భార్య రోజమ్మ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, అచ్చంపేట మండల పరిధిలోని పల్కపల్లి గ్రామ రైతు వేదిక సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమయినట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. గుర్తు తెలియని పురుషుడి మృతదేహం (45) ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చరికి తరలించామన్నారు. ఎవరికైనా ఆనవాళ్లు తెలిస్తే అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కుక్కల దాడిలో 23 మేక పిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన మేక పిల్లలు

తెలకపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని జంగమోనిపల్లిలో కుక్కల దాడిలో 23 మేక పిల్లలు మృతి చెందాయి. సోమవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన కొట్టె రామచంద్రయ్య తన పొలంలో ఉంచిన మేక పిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. వీటి ఖరీదు రూ. 2 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.



మేడికొండలో పంట పొలంలో పూర్తయిన గల్లీ కంట్రోల్



చిన్నతాండ్రపాడు రైతు పొలంలోని నీటి కుంటలో నిల్వ ఉన్న నీరు.



నౌరోజి క్యాంపు వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

ప్రతీ నీటి చుక్క.. ఒడిసి పట్టాలి పక్కా!

▸▸ 'జలనిధి' పేరుతో ఉపాధి హామీ పనులు

▸▸ భూగర్భ జలం పెంపే ప్రధాన లక్ష్యం



అయిజ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ నీటి చుక్కను ఒడిసి పట్టి నిల్వ చేయడం, నీటి వృథా ను అరికట్టడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. రోజురోజుకూ జనాభా పెరుగుతుండటంతో ఆ మేరకు నీటి వినియోగం పెరుగుతూనే ఉంది. దీంతో పాటు నీటి వృథా కూడా ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో జల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'జలనిధి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఉన్న నీటి వనరులను కాపాడుకోవడం, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టుకొని, భూమిలో ఇంకేలా చేయడం తదితర లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా చేయాల్సిన పనులను గుర్తించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసింది.

చేపట్టాల్సిన పనుల గుర్తింపు

కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా జలవనరుల పరిరక్షణ, జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను నిర్దేశించారు. సంబంధిత అధికారులు వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గత ఏడాది డిసెంబర్‌లోనే ఊరూరా గ్రామ సభలు నిర్వహించి పనులను గుర్తించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 1,55,000 జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 3.32 లక్షల మంది కూలీలుగా నమోదై ఉన్నారు. వారందరూ ఈ పనుల్లో పాల్గొననున్నారు. ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన పనులను అదే ఏడాది పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో పనులను చేపట్టి, సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు.



వర్షాకాలం నాటికి లక్ష్యం పూర్తి

నిర్దేశించిన పనులు వర్షాకాలం నాటికి పూర్తయితే ఆశించిన లక్ష్యాన్ని చేరుకుంటాం. అనుకున్న రీతిలో పనులు పూర్తయితే భూగర్భజలం పెంపొందుతుంది. జలనిధి పథకం కింద జిల్లాలో చేపట్టాల్సిన పనులను గుర్తించాం. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నీటి వృథా ను అరికట్టే ందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– నర్సింగరావు, డీఆర్‌డీఏ

జలనిధి' కింద చేపట్టాల్సిన పనులు

'జలనిధి' కార్యక్రమం కింద చేపట్టాల్సిన పనులను కేంద్రం గుర్తించి, సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసింది. వర్షం నీటిని ఒడిసి పట్టుకునేందుకు రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు (ఇంటి పైభాగంలో కురిసిన వర్షం నీటిని భూమిలోకి ఇంకేలా నిర్మాణాలు) ఏర్పాటు చేయడం, ఖాళీ స్థలాలు, పంట పొలాల చుట్టూ కందకాలు తవ్వడం, గల్లీ కంట్రోల్‌లు నిర్మించడం, వాగులు, వంకలపై చెక్‌డ్యాంల నిర్మాణం, అనువైన ప్రాంతాల్లో చిన్న కుంటలను నిర్మించడం, వాగులు, వంకల్లో నీటి నిల్వ, పొలాల్లో నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేయడం తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది. అలాగే సింగిల్ ఫేజ్ మోటర్లు, చేతి పంపుల వద్ద, ఇళ్ల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణంపై దృష్టి సారించాలి. ఆ దిశగా అధికారులు పూర్తి స్థాయి కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రతీ గ్రామ పంచాయతీలో మూడు నుంచి ఐదు వరకు నిర్మాణ పనులను చేపట్టారు. మేడికొండ, సంకాపూర్ గ్రామాల్లో ఇంకుడుగుంతల నిర్మాణం జరిగింది. సంకాపూర్, చిన్నతాండ్రపాడు గ్రామాల్లో నీటి కుంటల ఏర్పాటు పూర్తయ్యింది. మేడికొండ పంట పొలాల్లో గల్లీ కంట్రోళ్లు పూర్తి చేశారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన ధన్వాడ

▸▸ ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం

▸▸ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఉత్సవ విగ్రహాలను రథం వరకు ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ధన్వాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి రథోత్సవంలో ఏర్పాటు చేశారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య రథోత్సవం నిర్వహించారు. రథానికి పూలు, విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. రథోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంగస్థల నటుడు ఏ.శ్రీశైలం లంకేశ్వరు ఏకపాత్రాభినయం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. మరో రంగస్థల నటుడు మొల్కేమొల్ల బాలకృష్ణ పరుశురాం ఏకపాత్రాభినయం చేశారు. ప్రేక్షకుల చప్పట్లు, కేరింతల మధ్య ఏకపాత్రాభినయం కొనసాగింది. అనంతరం శ్రీశైలం, బాలకృష్ణలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భజన కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త సుంకు నర్సిములు, చాకలి బాలయ్య, ఉపాధ్యాయులు అశ్విని నర్సిములు, కెంచె రంగయ్య, రిటైర్డ్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఎం.సత్యనారయణ, కెంచె నారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, సిరం లక్ష్మన్న, బుదరపు సత్యయ్య, కెంచె జయప్రకాష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీయూ రిజిస్ట్రార్‌గా రమేశ్‌బాబు



రమేశ్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వీసీ శ్రీనివాస్, పీయూ అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా రమేశ్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా పనిచేసిన చెన్నప్ప వ్యక్తిగత పనులతో రాజీనామా చేశారు. దీంతో ఓయూ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు నియమితులయ్యారు. సికింద్రాబాద్‌కు చెందిన ఈయన ఓయూలో ఐదేళ్లకు పైగా అన్ని విభాగాల పరీక్షల నిర్వహణ అధికారిగా, సెట్ పరీక్షల కన్వీనర్‌గా పనిచేశారు. ప్రధానంగా అన్ని విభాగాల సెట్ పరీక్షలను, కౌన్సిలింగ్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించి సులభంగా, వేగంగా విధానాన్ని అమలు చేసి గుర్తింపును తెచ్చుకొన్నారు. కాగా వీసీ జీఎన్ శ్రీనివాస్ పూలబొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదుసూధన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి రాజ్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ రవికాంత్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



ఉట్లు కొడుతున్న యువకులు



ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజలు

కృష్ణ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కృష్ణ మండలం కుస్నీ గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో కోనేరు పరిసరాలను పరిశీలించి, మాట్లాడారు. రాబోయే రోజుల్లో వేణుగోపాలస్వామి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. సాయంత్రం దేవాలయం ప్రాంగణంలో పాల ఉట్లు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమశేఖర్‌గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనసూయమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసులో నేరస్థుడికి యావజ్జీవం

▸▸ రూ.5 వేల జరిమానా

మద్దూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరస్థుడికి యావజ్జీవంతో పాటు, రూ.5 వేల జరిమానా విధిస్తూ నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్‌రఫీ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ యోగేష్‌గౌతమ్ సోమవారం వెల్లడించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. మద్దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోవింద్ మొదటి భార్య మృతి చెందడంతో వెంకటమ్మను రెండవ వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ఇద్దరు ఆడ పిల్లలు ఉండగా, వీరిలో పెద్ద కూతురు వివాహం జరగగా రెండవ కూతురు కృష్ణవేణి దివ్యాంగురాలు కావడంతో వివాహం కాలేదు. గోవింద్ భార్య వెంకటమ్మ చిన్న కూతురు కృష్ణవేణితో కలిసి 12 ఏళ్లుగా హైదరా బాద్‌లో కూలీ పని చేసుకుంటు అక్కడే ఉంటున్నారు. 2002 ఫిబ్రవరి 13న తల్లీ కూతుళ్లిద్దరు పని నిమిత్తం బయటకు వెళ్లగా అక్కడే పనిచేస్తున్న వెంకటయ్య (వెంకట్రాములు) కృష్ణవేణికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని తల్లిదండ్రులు ఫిబ్రవరి 15న రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అదేనెల 18న మద్దూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో తమ కూతురు కృష్ణవేణి కాలిన గాయాలతో ఉందని తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన మద్దూర్‌కు చేరుకొని చికిత్స నిమిత్తం నారాయణపేట, అటు నుంచి మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై తల్లిదండ్రులు కూతురు కృష్ణవేణిని అడగగా వెంకట్రాములు అనే వ్యక్తి తనను ఆసుపత్రి సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేయడంతో నిరాకరించిన తనపై పెట్రోల్ పోసి తగిలించాడని తెలిపి అదే ఏడాది ఫిబ్రవరి 19న మృతి చెందింది. తమ కూతురు మృతికి కారణమైన వెంకట్రాములుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ కృష్ణవేణి తల్లిదండ్రులు మద్దూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐ జనార్ధన్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటును సమర్పించారు. ఈ క్రమంలో ప్రస్తుత డీఎస్పీ లింగయ్య సూచన మేరకు సీఐ సైదులు, ఎస్‌ఐ విజయ్‌కుమార్‌లు ఆదేశం మేరకు సిబ్బంది కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టారు. పీపీ ఆకుల బాలప్ప కోర్టులో వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో నేరస్తుడికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.5 వేల జరిమాన విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ఎస్పీ యోగేష్‌గౌతమ్ వెల్లడించారు. నేరస్తుడికి శిక్ష పడడానికి కృషి చేసిన పీపీ, పోలీస్ సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

ఉమామహేశ్వరుడి సన్నిధిలో సీతా దయాకర్‌రెడ్డి



ఉమామహేశ్వరాలయంలో పూజలు చేస్తున్న సీతా దయాకర్‌రెడ్డి

దోమలపెంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలానికి ఉత్తర ద్వారం, ఉమామహేశ్వరంలో కొలువు దీరిన స్వామిని సోమవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన ఆమె తొలి సారి ఉమామహేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ప్రమదమ్మ పాల్గొన్నారు.

సీసీరోడ్ల నాణ్యతపై విచారణ చేపట్టాలి

▸▸ ప్రజావాణిలో గద్వాల కలెక్టర్‌కు ఆయాగ్రామాల ప్రజల ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

గట్టు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణాన్ని నాణ్యత లేకుండా చేపడుతున్నారని, వెంటనే విచారణ చేపట్టాలని జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని పలుగ్రామాల ప్రజలు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గట్టు మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.4.40 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టారని తెలిపారు. ఇందువాసి, చాగదోణ, మాచర్ల, బోయలగుడ్డం, అంతంపల్లి, ముచ్చోనిపల్లి, మల్లంపల్లి, రాయపురం, గోర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో చేపట్టిన పనుల్లో నాణ్యతలేని ఇసుక, సిమెంటు, కంకరను వాడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక కూలీలను ఉపయోగించకుండా మిషన్లతో పనులు చేపడుతూ, కూలీల కడుపు కొడుతున్నారని, ఈ విషయాన్ని స్థానిక ఇంజనీర్‌ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు, గ్రామాల్లోని మాజీ పాలకులు ఇష్టారాజ్యంగా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, తక్కువ సైజులో రోడ్లు వేస్తూ బిల్లులు పొందడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. త్వరగా విజిలెన్స్ విచారణ చేయించాలని అంతంపల్లి ఆంజనేయులు, వీరశేఖర్‌గౌడ్, కే.వీరేశ్, రాముడు, రాఘవేంద్ర ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి

● ధన్వాడ ఎంపీడీవో సాయిప్రకాష్



ధన్వాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం లబ్ధికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సాయిప్రకాష్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను పరిషత్ కార్యాలయంలో అందించాలని సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి ఎప్పటిలోగా దరఖాస్తు చేసుకోవాలి?

దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈ నెల 14 వరకు గడువు పెంచింది.

ఇప్పటి వరకు మండలంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

మండలంలో సోమవారం ఉదయం నాటికి దాదాపు 152 దరఖాస్తులు అందాయి.

ఆదాయం సర్టిఫికెట్ తప్పనిసరా?

ఏం అవసరం లేదు. రేషన్ కార్డు లేదా, ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉంటే చాలు.

కేటగిరీ వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

మొత్తం 152 దరఖాస్తుల్లో బీసీ 84, ఎస్టీ 32, ఎస్సీ 21, ఈబీసీ 1, మైనార్టీకి సంబంధించి 13 దరఖాస్తులు వచ్చాయి.

ఇంకా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందా?

గడువు ఉంది కాబట్టి నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

న్యూస్ బాక్స్

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం

మాగనూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున స్వామివారి ఉత్సవ విగ్రహాలను దేవాలయం నుంచి రథం వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి హాజరై దేవాలయంలో, స్వామివారి రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు గోవింద నామస్మరణ, జైశ్రీరామ్ నినాదాలతో రథాన్ని లాగారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, శంకర్, తాయప్ప, నరసింహ, గ్రామస్థులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పేదలకు వరం

మాగనూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన సన్న బియ్యం పథకం నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మాగనూరు మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని వడ్వాటు, అమ్మపల్లి, మందిపల్లి గ్రామాల్లోని రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు ఆయన సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్, కాంగ్రెస్ నాయకులు శివరాంరెడ్డి, రాములు, కృష్ణమూర్తి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు సమర్పించాలి

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ధ్రువపత్రాలను పేట మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీవో సుదర్శన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు, ఆధార్, రేషన్ కార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ సదరం పత్రం, పట్టా పాసుపుస్తకం, ఫొటోలు రెండు జతలు సమర్పించాలని పేర్కొన్నారు.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రారంభం

మద్దూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడ్డ మద్దూర్ మునిసిపాలిటీ కార్యాలయంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రారంభమైనట్లు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన అనంతరం సోమవారం ఆయన ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఇకనుంచి సంబంధిత ధ్రువపత్రాలను జారీ చేస్తామని ఆయన చెప్పారు.

నర్సరీ, ఉపాధి పనుల పరిశీలన

కొత్తపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల్‌చెడ్ గ్రామంలో ఉన్న నర్సరీని, ఎక్కమేడు గ్రామంలో ఉపాధి పనులను ఎంపీడీవో కృష్ణారావు సోమవారం పరిశీలించారు. ఆయాచోట్ల నిర్వాహకులకు, కూలీలకు, ఉపాధి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే, తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోని ఎంపీయూపీఎస్‌ను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడే విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రసాద్, బాబు తదితరులున్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం..

కృష్ణ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తహసీల్దార్ వెంకటేష్ తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వంట ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లాలో మినీ రిజర్వాయర్లు ఏర్పాటు

» మత్స్య సంపద కోసం కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి చర్యలు

» మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నారాయణపేట న్యూటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా జిల్లాలో నాలుగు మినీ రిజర్వాయర్లు ఏర్పాటు కాబోతున్నాయని దాంతో మత్స్య సంపద పెరుగుతుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం నారాయణపేట ఎస్ఆర్ గార్డెన్‌లో జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సంఘం జిల్లా చైర్మన్ కాంత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌లు హాజరై, మాట్లాడారు. జిల్లాలో మత్స్య సంపదను పెంచి ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి చేసే విధంగా కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాకు త్వరలో మత్స్య మహిళా సంఘాలకు ఫిష్ క్యాంటీన్లు, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, దామరగిద్ద సింగిల్ విండో చైర్మన్ ఈదప్ప, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోనంగేరి హన్మంతు, ఆర్టీవో జిల్లా బోర్డ్ మెంబర్ పోషల్ రాజేష్‌కుమార్, డైరెక్టర్ నర్సింహనాయుడు, గౌరి శ్రీనివాస్ ఉన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

మక్తల్‌రూరల్/మరికల్/మాగనూరు : క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం ఊట్కూరు మండలం అనంపల్లి గ్రామంలో మండల స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాటింగ్ చేసి యువకులను ఉత్సాహపరిచారు. అంతకుముందు తిప్రాస్‌పల్లి గ్రామంలో నాభిశిల(శీతాలదేవి) బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమీన్‌పూర్, పగిడిమర్రి గ్రామాలతో పాటు మరికల్ మండలంలోని కన్మనూర్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. అలాగే, మాగనూరు మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్దనున్న కోనేరును ఎమ్మెల్యే పరిశీలించి, శుభ్రం చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.

మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో కొత్త సూగయ్య, రత్నమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ప్రారంభించి, ప్రజలకు అంబలిని అందించారు.

ప్రజావాణికి 25 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. కాగా, ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలం, ఆర్డీవో రాంచందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి : డీఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

నారాయణపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం అందించాలని డీఎస్పీ లింగయ్య కోరారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల దినోత్సవంలో భాగంగా ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నలుగురు ఆర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మిపతిగౌడ్

మక్తల్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు శ్రద్ధ వహించాలని చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మిపతిగౌడ్ నాగేశ్వరి, సంతోషి అన్నారు. ఊట్కూరు పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డిఫెన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం జ్ఞాన విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఆహారపు అలవాట్లు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సురేష్, డిఫెన్స్ కౌన్సిల్స్ కె.లక్ష్మిపతిగౌడ్, ఎన్.నాగేశ్వరి, డాక్టర్ సంతోషి, ఆసుపత్రి సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే రాజీవ్ యువ వికాసం

» కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మరికల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తీలేరు గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమని, రూ.6వేల కోట్ల నిధులతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని యువతీ యువకుల ఉపాధి కల్పన కోసం ప్రవేశపెట్టిందన్నారు. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ తదితర వర్గాల యువకుల కోసం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. గత ప్రభుత్వం అన్ని కులాల కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి, రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులకు అందించకుండా అరచేతిలో స్వర్గం చూపించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తారన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కోస్గి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్ అన్నారు. సోమవారం పట్టణంలోని కోడెల పాఠశాల రెండు పూటలా నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎన్ఎస్‌యూఐ నాయకులు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులను నిలదీయడంతో మధ్యాహ్నం వరకే పాఠశాలను వదిలేశారు. చిన్నారులను మధ్యాహ్నం కూడా పాఠశాలలో ఉంచుకోవడం సరికాదన్నారు. సెలవు రోజుల్లో కూడా పాఠశాల నడుపుతున్నట్లు విద్యార్థులు నాయకులకు తెలిపారు. దీంతో వారు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకుంటాం..

- ఎంఈవో శంకర్‌నాయక్

కోడెల పాఠశాల మధ్యాహ్నం నడుపుతున్నట్లు నా దృష్టికి వచ్చింది మరోమారు పునరావృతమైతే చర్యలు తప్పవు. నిబంధనలు పాటించని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు పంపిస్తాం.

అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలి

కోస్గి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈనెల 16న జరిగే అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘం కొడంగల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గౌరగళ్ళ కృష్ణ మౌర్య పిలుపునిచ్చారు. సోమవారం గుండుమాల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం జాతర కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో శివన్న, తిర్మలయ్య, వెంకటేష్, వెంకట్రామారెడ్డి, వెంకట్రాములు, రామకృష్ణ తదితరులున్నారు.

అంబేడ్కర్ జాతర మండల కమిటీ ఎన్నిక

కొత్తపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చౌరస్తాలో సోమవారం అంబేడ్కర్ జాతర మండల కమిటీని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల గౌరవ అధ్యక్షుడిగా ఎం.వెంకటయ్య, అధ్యక్షుడిగా కొత్తపల్లి నరేష్, ఉపాధ్యక్షుడిగా భూనీడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దుప్పట్టిఘట్టు మాజీ సర్పంచ్ వెంకటేష్, సహాయ కార్యదర్శిగా ఎక్కమేడు నర్సింహ, కోశాధికారిగా నందిగామ అంజి, ప్రచార కార్యదర్శిగా డేవిడ్ పరేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చిన్నయ్య, భీమేష్, నాగమ్మ, పద్మ, రాజు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నారాయణపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 60 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం, నియోజకవర్గ మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదు

మరికల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రాకొండ, పూసల్‌పహాడ్, పల్లెగడ్డ గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సూర్యమోహన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రతీ లబ్ధిదారుడికి సన్నబియ్యం అందించి రాష్ట్ర ప్రభుత్వానికి, రేషన్ డీలర్లకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ఆయన పూసల్‌పహాడ్ గ్రామంలో వడ్ల చారి అనే లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేసి, బాగుందని కితాబు ఇచ్చారు. హర్షవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రాజు, హరీశ్ తదితరులున్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

దామరగిద్ద, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దామరగిద్ద మండలం కండెన్‌పల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ మెంబర్ రాములుయాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తెలుగువారి ఆత్మ గౌరవం కోసం పుట్టిన పార్టీ అన్నారు. కార్యకర్తలతో కలిసి సైనికుల్లా పని చేసి రాబోయే రోజుల్లో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, మొగులప్ప, ఈరన్నగౌడ్, వెంకటప్ప, రమేష్, వెంకటప్ప, అశోక్, రాములు, నరేష్, బాలరాజ్, మహేందర్ తదితరులున్నారు.

బీజేపీ జెండావిష్కరణ

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగారం చౌరస్తా వద్ద సోమవారం బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ మండల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సింగారం మాజీ సర్పంచ్ నాగిరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. బీజేపీని బలపరుస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీజేపీ జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, బూత్ స్థాయి అధ్యక్షుడు కిష్టప్ప, ఉశప్ప, మాజీ ఉప సర్పంచ్ సిద్దప్ప, చంద్రకాంత్, కృష్ణయ్య, చిన్నయ్య, నర్సిములు, సతీష్, బాలప్ప, పి.బసప్ప, వెంకటప్ప, తిమ్మారెడ్డి ఉన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

మాగనూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మాగనూరు మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కందూరు రాంరెడ్డి లయన్స్‌క్లబ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసే శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. శిబిరాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

శిబిరం విజయవంతం

మక్తల్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మక్తల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎనుగొండ రాంరెడ్డి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో సోమవారం స్థానిక లయన్స్‌క్లబ్ భవనం వద్ద నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు క్లబ్ అధ్యక్షుడు డీవీ.చారి తెలిపారు. శిబిరంలో 60మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 40 మందికి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించి ఎనుగొండ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించారు. మిగతా వారికి కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. క్లబ్ సభ్యులు అనుగొండ శ్రీనివాసులు, అంజన్‌ప్రసాద్, జైపాల్‌రెడ్డి, మామిళ్ల పృథ్వీరాజ్ తదితరులున్నారు.

త్వరలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్ ఏర్పాటు



'రన్ ఫర్ హెల్త్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, కాళోజి యూనివర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డి తదితరులు

» ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

» వైద్య కళాశాలలో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని అప్పక్‌పల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకిషన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, కలెక్టర్ సిక్తా పట్నాయక్, కాళోజి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ప్రతీ గ్రామంలో వైద్య సేవలందాలని అన్నారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణపేట మెడికల్ కాలేజీ పురోగతిలో ఉందని, కళాశాలకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని, లైబ్రరీకి అవసరమైన 4 వేల పుస్తకాలను పంపిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పర్యావరణ వేత్త కె.పురుషోత్తంరెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి ప్రసాద్‌రావు, డాక్టర్ విజయ, సీనియర్ జర్నలిస్టు పంతంగి రాంబాబు, సామాజికవేత్త కుంభం శివకుమార్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, వైద్య నిపుణులు ఆదిత్య, చంద్రమోహన్ తదితరులున్నారు.

కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలి

» మునిసిపల్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మునిసిపాలిటీలోని రోడ్డు డివైడర్ మధ్యలోనున్న కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించి వేరే చెట్లను పెట్టాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నారాయణపేట క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. కాలుష్యానికి కారణమవుతున్న కోనోకార్పస్ చెట్ల తొలగింపును యుద్ధప్రాతిపదికన చేపట్టి వేరే చెట్లను పెట్టాలని ఆదేశించారు. అలాగే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గుంతలమయంగా మారిన సరాఫ్‌బజార్ రోడ్డును వెంటనే సీసీగా మార్చేలా కొత్త రోడ్డు వేయాలన్నారు. టీయూఎఫ్ఐడీయూసీ రూ.4 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలన్నారు. సమావేశంలో కమిషనర్ భోగేశ్వర్లు, ఇంజనీర్ మహేష్, టీపీవో కిరణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులున్నారు.

డీపీఆర్ తయారీపై కమిషనర్ సమావేశం



మునిసిపాలిటీ డీపీఆర్ తయారుపై పరిషత్ కార్యాలయంలో సమావేశమైన నాయకులు, అధికారులు

మద్దూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడ్డ మద్దూర్ మునిసిపాలిటీ అభివృద్ధిపై ఎస్‌సీపీ కన్సల్టెన్సీ ద్వారా డీపీఆర్ తయారు చేసేందుకుగాను స్థానిక నాయకులతో సోమవారం మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను ఎస్‌సీపీ సంస్థ తయారు చేస్తుందన్నారు. ఆ రిపోర్టు ఆధారంగా మునిసిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడతామని కమిషనర్ వివరించారు. ఈ విషయంపై స్థానిక నాయకులు సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ ఏఈ మహేష్, అధికారి రామునాయక్, మద్దూర్ మాజీ ఎంపీపీ సంజీవ్, కాంగ్రెస్ మండల నాయకులు వీరేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్, బాబు, మల్లికార్జున్‌గణప, శ్రీనివాస్, యాసీన్, చందు, విజయ్, గోవిందు తదితరులున్నారు.

కేంద్రం తెస్తున్న కార్మిక కోడ్లను రద్దు చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

నారాయణపేట న్యూటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం తెస్తున్న నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, భూపాల్‌లు డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట అభినందన్ ఫంక్షన్ హాల్‌లో సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని ఉద్దేశించి వారు ప్రసంగించారు. ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత చట్టం, ఎనిమిది గంటల పని విధానం, సంఘం పెట్టుకొనే హక్కు, సంఘటితంగా పోరాడే హక్కు, సమ్మె హక్కులతో కూడుకున్న చట్టాలన్నీ లేబర్ కోడ్లతో ఆవిరి అయిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు, యజమానులకు అనుకూలంగా తెచ్చిన ఈ చట్టాలను వెనక్కి తీసుకొనే దాకా కార్మికవర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రామ్, ఉపాధ్యక్షుడు జోషి, గోవింద్‌రాజ్, కాశీనాథ్, భీమప్ప, కృష్ణయ్య, భీమేష్, శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్స్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ, పుష్ప, ఆశ జిల్లా అధ్యక్షురాలు బాలమణి, తిరుపతమ్మ, మణిమాల, బాలప్ప, సాయిలు తదితరులున్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి



పీవోడబ్ల్యూ, పీవైఎల్ సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జమీల్

దామరగిద్ద, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీవోడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆయా సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ సంఘం రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి కోస్గి ప్రతాప్‌లు మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేశారని దాని మూలంగా కొత్తగా పెళ్లి చేసుకున్న వారు పదేళ్ల కాలంలో జన్మించిన పిల్లలను లబ్ధిదారులుగా గుర్తించడం లేదన్నారు. రేషన్ దుకాణాల్లో 14 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని, లేకపోతే పీవోడబ్ల్యూ, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం దామరగిద్ద తహసీల్దార్ జమీల్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా నాయకులు సునీత, లక్ష్మి, గజలమ్మ, అరుణ, ప్రగతిశీల యువజన సంఘం కార్యదర్శులు సాయి, పెద్దింటి మధు, రైతు సంఘం జిల్లా నాయకులు తాయప్ప, పీవైఎల్ జిల్లా నాయకులు రాము, మహేష్ తదితరులున్నారు.

ఘనంగా అనంతసేన స్వామి ఉత్సవాలు



రథోత్సవంలో భక్తులు

నారాయణపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పళ్ల అనంతసేన దేవాలయంలో సోమవారం ఆలయ అర్చకుడు శ్రీపాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు, మహా రథోత్సవం ఘనంగా జరిగింది. హరిదాసుల సంకీర్తనల మధ్య స్వామివారి పల్లకీ సేవ చేపట్టారు. మక్తల్‌కు చెందిన విద్వాన్ రాఘవేంద్ర ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తు శ్రీరాముడి మహత్యం వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రఘుప్రేమ్, శ్రీపాద్, విద్వాన్ హరీశఆచార్య, అనిల్ దేశాయి, ప్రహ్లాద్, మాజీ కౌన్సిలర్ మేఘన, మహిళ భజన మండలి సభ్యులు, భక్తులు రాజేశ్వర్‌రావు, శేషు, రవీంద్రచారి, నర్సింహ, భరత్, గురురాజ్, దరణీధర్, శ్రీను, అనిరుధ్, జయతీర్థ తదితరులున్నారు.